# రాత్రి - పగలు



సూర్యారావుకి ఆ నెలంతా టూర్లే.

దగ్గరదగ్గరగా వున్న ఊళ్లన్నీ ఒకే ట్రిప్‌లో విజిట్ చేయడం వల్ల కాలం, డబ్బూ రెండూ కలిసి వస్తాయని ఆ విధంగా టూర్ ప్రోగ్రాం నిర్ణయిస్తుంటారు కంపెనీ వారు.

గోదావరి జిల్లాల్లో మూడు, నాలుగు చోట్ల ఆ కంపెనీ బ్రాంచీలు ఉన్నాయి. వాటిని చూసుకుంటూ ఆ వరుసలో కాకినాడు చేరాడు సూర్యారావు. ప్రోగ్రాం ప్రకారం ఆ ఊరిలో రెండు రోజుల క్యాంపు.

మామూలుగా అయితే హోటల్లో దిగేవాడు కాని, ఆ ఊళ్లో దగ్గరి స్నేహితుడు ప్రభాకర్ ఉండడంతో వాళ్ళ ఇంటిలో దిగాడు సూర్యారావు.

అసలే వేసవికాలం. ఆరాత్రి బాగా ఉక్కపోస్తోంది.

నిద్రపట్టక, ఏమీతోచక రెండో ఆట సినిమాకి వెళితే బాగుంటుందనిపించింది అతనికి. ఆ మాటే మిత్రుడు ప్రభాకర్‌తో అన్నాడు. తలనెప్పి ఉందన్న కారణంగా తాను రాలేనన్నాడు ప్రభాకర్. అందుకని ఒక్కడే బయలుదేరాడు సూర్యారావు. తీరా- సినిమాహాలు దగ్గరకి చేరేసరికి, కొత్త సినిమా టికెట్ కూడా దొరకలేదు. 'ఏంచేయాలా...' అని ఆలోచిస్తూ తిరుగుముఖం పట్టాడు.

ఆ రోడ్డు మీదకి వచ్చేసరికి- ఎవరో "ఏమండీ..!" అని తనని పిలిచినట్లనిపించింది సూర్యారావుకి.

వెనక్కి తిరిగిచూస్తే ఆ ప్రక్కింటి వరండాలోనించి, అందంగా అలంకరించుకున్న ఓ యువతి తననే పిలుస్తోంది. అప్పుడు జ్ఞాపకం వచ్చింది సూర్యారావుకి- తానున్నది ఆ ఊరిలో ప్రసిద్ధి పొందిన 'రెడ్‌లైటు ఏరియా' అని!

అప్రయత్నంగా కాళ్లు అటులాగాయి.

ఆ యువతి అతన్ని సాదరంగా లోనికి ఆహ్వానించింది.

ఆమె పడకగది విశాలంగా, అందంగా ఉంది. పందిరి, పట్టెమంచం, గోడలకి అన్నివైపులా పెద్ద పెద్ద అద్దాలు, అందమైన పటాలు ఉన్నాయి. ఇతర అలంకరణకూడా ఎంతో అందంగా ఉంది.

అసలే ఆ యువతి చాలా అందంగా ఉంది. అటువంటి ఆమెను ఆ పడకగదిలో చూస్తుంటే అచ్చం స్వర్గం నుంచి దిగివచ్చిన అప్సర అనిపించింది.

'ఆహా... ఇంతటి అందగత్తె నాభార్య అయివుంటే ఎంత బాగుండేది!' అనుకొని మనసులోనే అసలు భార్యను తలచుకొని అసహ్యించుకున్నాడు. డబ్బు పోతేపోయింది- ఆరాత్రి ఆమెతో సూర్యారావు అనుభవించిన ఆనందం వర్ణనాతీతం!

మర్నాడు ప్రొద్దున్నే ప్రభాకర్ ఇంటిముందు వసారాలో కూర్చొని పేపర్ చూస్తున్నాడు సూర్యారావు.

పాకీమనిషి తట్టని చంకన పెట్టుకుని దొడ్డి తుడవడానికి వచ్చింది... అతని ముందునించే!

అంతకుముందు ఆమె ముఖాన్ని ఎక్కడో ఈమధ్యనే చూసినట్లుగా అనిపించింది. కాని, ఎంత ఆలోచించినా ఎవరిదో మాత్రం గుర్తుకురాలేదు.

ఆ పాకీమనిషి దొడ్డి శుభ్రం చేసి తిరిగివస్తూ సూర్యారావు ముఖంవంక చూస్తూ వెళ్లిపోయింది.

ఆమె గురించి బాగా ఆలోచించసాగాడు సూర్యారావు.

అతను అలా ఆటోచిస్తుండగా సడన్‌గా జ్ఞాపకం వచ్చింది. ఆమె ఎవరో కాదు- క్రితంరాత్రి తను ఆనందంగా గడిపింది ఆ 'అప్సరస' తోనేనని!

అప్పటికే ఆ సుందరి కనుమరుగై పోయింది. ఆమె ఎవరో గుర్తుపట్టాక సూర్యారావు వెన్నులో షాక్ కొట్టినట్లయింది.

*- విశ్వ రచన పక్ష పత్రిక... 16 జూలై '90*



## మంచి మందు

సుందరి, సుకుమార్ కొత్తగా కాపురం పెట్టారు. భర్తకి కొత్తకొత్త వంటలు, పిండి వంటలు చేసిపెట్టాలని 'ట్రైడ్ ఔట్ రెసిపెస్' (TRIED OUT RECIPES) అన్న పుస్తకం తెప్పించింది. పాపం.. పుస్తకం ముందేసుకుని శ్రద్ధగా, ఓపిగ్గా, రోజుకో రకం భర్తకి చేసిపెట్టసాగింది సుందరి.

కాని, పాపం- సుకుమార్‌కి ఆ వంటకాలు తింటుంటే వారం రోజుల నాటి తిండి కూడా గొంతులోకి రాసాగింది. అక్కడికీ బాధపడ్తుందని సున్నితంగా "ఎందుకు చెప్పు- నీకీ శ్రమ? ఏదో అలవాటైన వంట చేస్తే సరిపోదా? నేనేమైనా అడిగాను కనుకనా?" అనేవాడు. అక్కడికీ సుందరి వదలకుండా వంటల మీదా, భర్త మీదా ప్రయోగాలు చేస్తూనే ఉంది.

ఒకరోజున వంటింట్లోకి వెళ్లేసరికి పుస్తకం పేరును 'టైర్డ్ ఔట్ రెసిపెస్' (TIRED OUT RECIPES) అని దిద్ది కనిపించింది. దానితో 'చేసి చూసిన వంటకాలు' కాస్తా 'అలసి ఆపిన వంటకాలు' అయింది.

అంతే.. మళ్లీ ఆ ప్రయోగాల జోలికి పోలేదు సుందరి.